# ఆకాశవాణి కథలు

= శ్రీ శిష్ట్లా ఉమామహేశ్వరరావు =

## 3. గాలివాన గౌరిదేవి

గౌరిగాథనుగురించి గాంగేయుడుగూడా అయనానికయనానికీ అనుకుంటూండాలి!

షుమారు డెబ్భైయేండ్లక్రిందట వాడ్రేవుకూ, ఒంగోలుకూ మధ్య ఒక గ్రామం ఉండేది. సముద్ర తీరానగా కొంచెప్పల్లపువాలుగా ఆగ్రామం ఉండటంవల్ల రాళ్లతోనూ, కొయ్యలతోనూ, ఇటుకలతోనూ, అడుసుతోనూ కలిపి గోడమాదిరిగా సముద్రపుటొడ్డు గ్రామం చుట్టూ కట్టుకున్నారు ఆగ్రామస్థులు. అట్టి గ్రామంలో పుట్టింది ధైర్యశాలియైన గౌరీదేవి అనే ఓ కన్నె. పుట్టగానే పోయాడు తండ్రి. లేక లేక పెద్దతనంలో పుట్టిన పిల్లగనక బహుగారాముతో పెంచింది; అష్టకష్టాలూ అనుభవించింది తల్లి.

గౌరికి పదిహేనోయేటనే తల్లిశ్రమ, శ్రద్ధా గ్రహించి, మంచి చతుసున్న గల కన్నెగనక చేతనయిన సహాయము తల్లికి చేస్తూ జీవిస్తున్నది.

గౌరికి పదిహేడవయేట ఆగ్రామానికి గాలివానా, ఉప్పెనా వచ్చింది. గ్రామస్థులు కట్టిన అడుసు గోడ పెడుసు చూపిస్తున్నది. పగుళ్లుబారింది. మెల్లి మెల్లిగా నీరెక్కిపోతున్నది గ్రామంలో. ఇండ్లు మునిగిపోతున్నాయి.

గ్రామానికి దూరంగా చిన్నచిన్న కొండలున్నాయి. మెల్లిగా ఆకొండలమీదకు చేరితే ఉప్పెన అణిగిపోయినతర్వాత బ్రతకవచ్చు. ప్రతినిముషమూ నీళ్లు విజృంభిస్తున్నాయి. జనం ఇండ్లకప్పులమీదికి గూడా చేరుతున్నారు.

పొడుగ్గా కిన్నెరకన్నెల్లే ఉంటుంది గౌరి. దిగులుతో భగవంతుని ప్రార్థించింది. భగవదాజ్ఞానుసారం ఆకాశవాణి వచ్చింది. ఆకన్నెనొక ఆదర్శప్రాయనుగా చేద్దామనుకుంది ఆకాశవాణి. కన్నెపీనులకు విజ్ఞానమిచ్చింది.

గౌరితల్లి మహాపొట్టి. కాసిని నీళ్లైనా మునిగిపోతుంది. అందుకని గౌరి ఆమెను బుజాలమీదికెక్కించుకుంది. ఎదురురొమ్ములమీదకు కుమ్ముకున్న నీటిని దాటుకుంటూ కొండకై ప్రయాణం కట్టింది. తల్లికి ధైర్యం చెప్పింది.

ఇరుగుపొరుగువారు చూచారు. అందాకా వాళ్లకేయాలోచనా తట్టలేదు. గౌరి పోతుంటే తమగతియేమిటని గాభరాపడ్డారు.

“మా తల్లి మహాపొట్టి. ఆవిడను ముందా కొండమీద వదిలొస్తాను. ఆవిడ ముసలిది. ఈ లోపల మీ రాఎత్తైన స్థలాలల్లో నిలబడి ఉండండి. మీ బిడ్డల కేం భయం లేదు. నేనున్నా. వస్తున్నా. ఇదుగో! పాపం ఆ మేకపిల్లనుగూడా తీసుకుపోండి. దాన్ని నేను పెంచుతున్నా. నే నిప్పుడే వస్తా, జడవవాకండి.” అన్నది గౌరి.

తల్లిని కొండమీద దించింది. బయల్దేరింది వెనక్కు. నీళ్లు పొంగిపోతున్నాయి. అయినా భయపడలేదు. తల్లిమాత్రం “బిడ్డా, బిడ్డా, ఉప్పెన ఉప్పొంగిపోతున్నది. దారిలేదు, తెన్నులేదు. అంతా జలమయం. చెట్లుగూడా మునుగుతున్నాయి. మళ్లీ ఎందుకమ్మా” అన్నది.

“తల్లీ! మనవంటివాళ్లే మన ఇరుగుపొరుగువాళ్లు. వాళ్లకిద్దరు బిడ్డలుగూడా! పోయి సాయంచేసొస్తా” అన్నది గౌరి.

విసురుకో వస్తోంది గాలి. వెనక్కు తోస్తోంది. ఫెళఫెళలాడుతూంది నీరు. ఆ నీటిని తోసుకుంటూ

ఆ గాలిని ఎదిరిస్తూ పోయింది గౌరి. తానే యెత్తైన స్థలంమీద తానొచ్చేదాకా ఇరుగువాళ్ల నుండమన్నదో ఆస్థళం చేరుకున్నది. చేరిందో లేదో భళ్లున అడుసు గోడ తుడుచుకుపోయింది. ప్రళయమల్లే ఎక్కడ చూచినా జలమే. ఎక్కడ చూచినా సుడులే. నడుస్తున్న గోడలల్లే అక్కడక్కడ ఎత్తైన అలలు. ఆ అలలు ఎదుర్కొన్న వాటినన్నిటినీ తుడిచేస్తున్నాయి. గౌరినీ, ఇరుగువాళ్లూ నుంచున్న స్థలంగూడా మునిగింది. గౌరికి గొంతువరకొచ్చాయి నీళ్లు. ఇరుగువారిలో తల్లీ, దండ్రీ కొట్టుకుపోయారు. పెద్దబిడ్డ మేకను పట్టుకుని వదవదలాడింది. ఉప్పెనకు ఉపేక్షలుంటాయా! ఆ బిడ్డా, ఆ మేకాగూడా కొట్టుకుపోయారు.

పసిబిడ్డను గొంతుమీద కూర్చోపెట్టుకుంది గౌరి. "పాపం, బిడ్డ ఎంతసంతోషంగా ఉన్నది! ఈ బిడ్డకేమీ తెలియదుగదా! ఈ ఉప్పె నేమిటో! ఈ మారణమేమిటో! ఈ బిడ్డనన్నా రక్షించాలి. గ్రామస్థులు ఎంతమంది? గ్రామస్థులు ఎంతమంది తప్పించుకున్నారో, అస లెవరైనా బ్రతికారో లేదో? ఈ బిడ్డయినా మిగిల్తే బాగుండును!" అనుకుంది.

ఆ ప్రళయజలాలు గౌరినెత్తినిగూడా ముంచాయి. రెండుచేతులూ బారచాచి పైకెత్తి పైన రెండరచేతుల్లోనూ పసిబిడ్డను పట్టుకుంది. కాళ్లు కదపలేదు. ఒళ్లు మెదపలేదు. ఉప్పెనను మించింది. అలలను మించింది. సముద్రాన్ని మించింది. అన్నిటినీ మించింది. ఎదుర్కొని అట్లాగే నుంచుంది. ఎంత స్థైర్యం. ఎంత సహృదయం! ఆమెలో అంతరించిఉన్న ఆకాశవాణిశక్తియే ఆమెనాడీబలం. గుటకలు వేస్తున్నా కదలలేదు. జీవం ఉందో లేదో! ఇంతకీ పసిబిడ్డ అదృష్టవంతురాలు.

మత్స్యవేటకై మహాంబుధి జొచ్చి మరలి వస్తున్న నలుగురు జాలరులు ఉపకార బుద్ధితో నావమీద ఇటూ అటూ తిరుగుతున్నారు. వాళ్లకు సముద్రం ప్రసవించిందా అన్నరీతిగా అలలపైన కిలకిలలాడుతూ ఆ పసిబిడ్డ కానవచ్చింది. వెంటనే దగ్గరకు పోయారు. ఆబిడ్డను రెండుచేతులు మోస్తున్నాయి. వాళ్లు గ్రహించారు. ఆ బిడ్డనూ, ఆ గౌరినీ తమ నావలో కెక్కించుకున్నారు. గౌరికి ప్రాణంలేదు. ప్రాణంలేకుండాకూడా బిడ్డ నరచేతుల్లో మోస్తూ ఎంతసేపు నుంచుందో! ఏ శక్తిసామర్థ్యాలవల్ల అలా నుంచుందో! ఆశ్చర్యపోయారు నావలో నలుగురూ. నావ నడిపించుకుంటూ భద్రమైన స్థలాన్ని చేరారు. పొరుగూరులో కరుణకలిగిన ఒక గృహస్థు ఆబిడ్డను పెంచాడు.

ఆ బిడ్డ పెరిగి పెద్దయైనతర్వాత తన పేరు గౌరి అనే పెట్టుకుంది. గ్రామస్థులు చిట్టిగౌరి అని పిలిచేవారు. పేరూ ఊరూ లేకుండా కొట్టుకుపోయిన తన ఊరుదగ్గిర పెద్దగౌరి కో చిన్నతులసీకోట ఇటుకతో కట్టించింది. ఏటేటా ఆ కోటగూటిలో దీపారాధన చేసి కాసేపు కూర్చుని దైవప్రార్థన చేసుకుని వచ్చేది చిట్టిగౌరి. ఇప్పటికీ గౌరిగాథ బెస్తవాండ్లలో అస్తమించిపోలేదు.

## 4. బాలక పరివర్తనం

వసంతఋతు వెటువంటిది! చలిపోయి ఎండలు ముదరకుండా మధ్యకాలంలో చిగురిస్తూచిగురిస్తూన్న చెట్లు చూడడాని కెంత రామణీయకంగా ఉంటాయి? మిట్టమధ్యాహ్నముమాత్రం కొంచెము మిటమిటలాడుతూంటుంది.

ఆరోజూ అట్లాగే మిటమిటలాడుతోంది. అయితే నాలుగుగంటలకు స్కూలుపిల్లలు ఇంటికి పోతోంటే చూస్తూన్నప్పుడు మధ్యాహ్నపు టెండవుమ్మరం మరపుకొస్తుంది.

అరుచుకుంటూ, దెబ్బలాడుకుంటూ, రాగాలు తీస్తూ, నవ్వుకుంటూ, పరాచికాలాడుకుంటూ పోతూండే ఆబడిపిల్లలను జూచి ముసల్లెనీగూడా ముసిముసినవ్వులు నవ్వాలి.

స్కూలు కెదురుగా చిన్నిపార్కొకటుంది. కొంతమంది గుంట లాపార్కులో చీకటిపడేదాకా ఆడుకుని మరీ పోతారు. ఆరోజు వాళ్లూ ఆగలేదు. బండ్లమీద పోయేవాళ్లూ, నడిచిపోయేవాళ్లూగూడ తొం

దరలొందరపడి పోతున్నారు. మబ్బుపడుతున్నది. రాగూడని వర్ష మారోజువస్తుందేమో!

వర్షమొస్తేనేంగాని, పేదరాశి పెద్దమ్మల్లే, కామమ్మ అనే పేరుతో ఆకాశవాణి స్వయంగా ఒక చిన్న లాగుడుకొట్టు పెట్టుకున్న దాపార్కుకూ, స్కూలుకూ మధ్య. బడిపిల్లల తరహాలు చూద్దాం కొన్నాళ్లనుకుంది. ఆవిడె చేలాగుడుబండిపై చిన్నచిన్న మిఠాయిలూ, కమలాలూ మొదలైనవి పెట్టుకుని అమ్ముతూన్నట్టుగా నటిస్తుండేది. ఆబండికి తగిలించి ఎత్తుగా ఒక తాటాకులగొడుగు. ఎండకూ, వానకూ అండ అదే!

"ముసురుపడుతున్నదే. ముసలిదానను. గాలి దుమార మెక్కువైతే యీబండీ, నేనూ ఇల్లెల్లా చేరగలం? ఊహు. సరుకులు సర్దుతా" అనుకుంది ఆకాశవాణి కామమ్మ.

ఆవిడ క్రిందపడుతూ మీదబడుతూ సరుకులు సర్దుకుంటుంటే దారినే పోయేవా రొక్కరూ చేయూతనిచ్చినవారు కారు. ఇంతలో ముగ్గురు నలుగురు కుర్రాళ్లు పరుగెత్తుకుంటూ వచ్చారు. అందులో రౌడీరంగారావనేవాడికి పధ్నాలుగేం డ్లుంటాయి. వాడీమెనూ, యీమె వేషాన్నీ చూచి ఆగి "ఒరేయి చూడండర్రా," యీముసలిదయ్యాన్ని" అన్నాడు.

ఇంకొకడు "పదండర్రా పదండర్రా" అన్నాడు. అంతే. ఆమెను గురించి మరోవిచారం యేమీ లేకుండా వెళ్లిపోయా రాకుర్రాళ్లు.

అట్లాగే సర్దుకుంటున్న దాకాశవాణి కామమ్మ. ఆమెవెనకాల అడుగులు వినబడ్డాయి. వెనక్కు తిరిగి చూచింది.

"ఏమి అమ్మమ్మా! వర్షమెక్కువైయేటట్లున్నదే పాపం!" అంటూ ఓకుర్రాడు దగ్గిరికొచ్చాడు.

"రామ్మూర్తివా! అవునబ్బాయీ. కొట్టు మూసేస్తున్నా!" అన్నది.

రామ్మూర్తి ఆవిడె సర్దుకోవడంలో సాయపడ్డాడు. ఆవిడె సరుకుల్ని చేతిబండిమీద సరిగా అమర్చాడు. గొడుగును కుదిర్చాడు. ఒకచేత్తో బండిని లాగుతూ "ఈ చెయ్యి పట్టుకో అమ్మమ్మా. ఎంతవానొచ్చినా నేనున్నానులే" అన్నాడు.

"ఎంత మంచివాడవోయీ. ఫరవాలేదులే. సర్దేశావుగా. నేనింక వెళ్లగలనులే. నీకెందుకొచ్చిందీ కష్టం" అన్నదావిడె.

"కష్టమేమీ లేదమ్మమ్మా" అన్నాడు రామ్మూర్తి. "నాతోకూడా రా!" అంటూ అడుగువేశాడు.

ఇదివరకుగూడా వీళ్లిద్దరికీ స్నేహమే. పిల్లవాళ్లల్లోకల్లా మంచి పిల్లవాడు రామ్మూర్తి అని ఆవిడనుకుంటుంది. అమ్మేవాళ్లల్లో కల్లా ఆ అమ్మమ్మ మంచిదని వాడనుకుంటూంటాడు.

"నీవు పుట్టినరోజు పండగప్పుడు కాదూ మీ నాయన పావలా ఇస్తే అదంతా నా దగ్గిరే కొన్నావు? నీ వొక్కడవే తిన్నావా? లేదు. నీ స్నేహితులందరికీ పంచిపెట్టావు. అంతా అట్లా చేయగలరూ? మంచి పిల్లవాడివి నీవు. నీ మంచితనం కాపాడుకో. ఆ రౌడీ రంగడితో తిరగవాకు" అన్నది ఆకాశవాణి కామమ్మ.

కొంతదూరము పోయాక ఆవిడె అలిసిపోయినట్లగుపించింది. రామ్మూర్తి చేతిలో ఇంటికి తీసుకుపోతున్న అర్ధశేరుపాలున్నాయి. ఆచెంబు బండిమీదే ఉంచాడు. ఆవిడెను చూచి "అమ్మమ్మా, చూడు! నీవలిసిపోయావు. నడవలేవుగాని సగంపాలిందులోవి పుచ్చుకో!" అన్నాడు.

"అన్నన్నా! వద్దు వద్దు. మీ అమ్మ యేమంటుంది?" అన్నది ఆవిడె.

"మా అమ్మ ఇలాంటి మంచిపని చేస్తే యేమీ అనదు అమ్మమ్మా. నీ విదివరకూ మా యింటికెన్నిసార్లు అటు పోతూ వస్తే ఇంట్లో పిండివంటలుంటే పెట్టలేదు?"

"నిజమేనోయి. కాని నా మాట విను. నిన్ను నమ్మి నీ చేతి కెవరేపని యిస్తే వారి కాపని మళ్లీ వప్పగించాలి. ఇది మరవవాకు." అన్నదావిడె.

"అవును అమ్మమ్మా. ఒకసారి నేనూ, రంగడూ బజారుపోయాం. మాఅమ్మ తెమ్మంటే పావుసేరు

ద్రాక్షపండ్లు కొన్నాను. దారిలో వస్తూ సగం తినే శాం. ఇంటికొచ్చింతర్వాత అమ్మ బాగా చివాట్లే సింది...ఇదుగో మీవాకిటిదగ్గిరి కొచ్చాం. సరుకులు లోపల పెడతానుండు." అంటూ వా డామెకు అందు లోనూ సాయపడ్డాడు. తర్వాత "నే పోతున్నా!" అంటూ వెళ్లిపోయాడు.

"మంచి కుర్రాడు. పెద్ద భాగ్యవంతుడు కాక పోయినా గుండె దొడ్డదిగలవాడు. ఆరంగడున్నాడు. జమీందారుపాయట. ఎందుకూ, ఎత్తుకుతినడానికి? మన వాడికి మంచిసావాసం గాదు." అనుకుంటూ లోపలికి పోయిం దావిడె.

ఇంటికి వెళ్లంగానే రామ్మూర్తిని వాడి తల్లి అడిగింది: "ఇదేమిట్రా అబ్బాయి! పొద్దుపోయింది. ఇంతాలస్యమా?"

"కామమ్మమ్మమ్మను ఎరుగుదువుగా అమ్మా! పాపం, ముసిల్ది. ఇంటిదాకా వదిలిపెట్టివచ్చాను." అని ఏదో ఒక చుట్టానికి తోడుగా వెళ్లివచ్చినవాడల్లే పలికాడు.

వాడి తల్లి చిరునవ్వుగా ముఖము పెట్టింది. దొడ్డయిల్లాలు. కాపురపునిర్వాహకం తెలిసిన యామె. కుమారుడు సత్ప్రవర్తకుడుగా ఉండాలెనని పట్టుదల గల మనిషి. ఆవిడెదగ్గిర వున్న అన్ని సుగుణాలలోనూ ముఖ్య మైనది కుమారునితో నమ్మకముగా మాటాడుతుంది. వాడి నమ్మికను తీసుకుంటుంది. నమ్మికను ప్రోత్స హిస్తుంది. వా డింక అబద్ధా లెట్లా ఆడుతాడూ!

రామ్మూర్తిగూడా చక్కగా పెరిగాడు. అన్ని సంగతులూ తల్లితో చెప్పతాడు. దాపరికం లేదు.

"కామమ్మమ్మమ్మ మహా తమాషామనిషే అమ్మా! ఆవిడె కెన్ని విషయాలు తెలుసనుకున్నా వూ?" అన్నాడు మర్నాడుదయాన రామ్మూర్తి.

"కావచ్చునురా అబ్బాయీ" అన్నది తల్లి.

తాను గతరాత్రి పాలిస్తా ననడమూ, ముసల్ది వద్దంటూ తనతో చెప్పిన మాటలూ తల్లితో అన్నాడు రామమూర్తి. "నే నావిడెకు పాలిచ్చివుంటే నీకు కోపం వచ్చేదా అమ్మా?" అని అడిగాడు.

"వచ్చేది కాదుగాని.........ఊ... సరేలే!" అన్న దావిడె. చిన్నపిల్లవాడి దొడ్డహృదయాని కడ్డు రావడ మెందుకూ అనుకుంది. ముసల్ది చెప్పిన మాటలే నిజమైన నీతిగలవి. అయితేనేమిలే అనుకుంది తల్లి. పైకి అన్నది: "ఇస్తే మంచిపనే లేరా అబ్బాయీ."

ముసలి కామమ్మగా ఉన్న ఆకాశవాణి పరిశీ లనము సత్యమే. ఆవిడనుకున్నట్లు రామ్మూర్తి గుణ వంతుడేగాని స్నేహితుల చెప్పుదలలలో పడిపోతూం టాడు. అందులో రౌడీరంగడు చిన్నతనాననే గడుసు వాడు. రామ్మూర్తిని చెడగొట్టగలడు. రామ్మూర్తి కింకొక్కరవ్వ మనోబలముండును రౌడీగాడ్ని సాక్షీ చేయగలిగిగూడా వుండేవాడు అనుకుంది ఆవిడె.

స్కూలుకూ, పార్కుకూ మధ్య యథాప్రకారం గా తన చేతి లాగుడుబండిని నిలబెట్టి, పైభాగము శుభ్రం చేసి ఒక్కొక్కటే తినుబండారాలను అమర్చింది. గొడుగు సరిజేసింది. దూరాన చూస్తూ రామ్మూర్తి వస్తు న్నాడని గ్రహించింది.

"రానీ పాపం! రోజూ కానిదో అర్ధణాదో నాదగ్గిరే కొనుక్కుంటాడు." అనుకున్నది.

"ఓహో అమ్మమ్మా! పెందరాడే వచ్చావే యివ్వాళ!" అన్నాడు దగ్గిరికొచ్చిన రామ్మూర్తి.

"అవును నాయనా! యేంగావాలి నీకూ?" అని అడిగిం దావిడె.

"నాలుగు దానిమ్మపండ్లూ, డజను చిట్టిగారె లూనూ ఇవ్వమ్మమ్మా" అన్నాడు రామ్మూర్తి.

అంత అమ్మకం దొరికినందుకు సంతోషిస్తూ గబ గబా వా డడిగినవి వాడి చేతి కిచ్చిం దావిడె. వాడు తీసుకుని తళతళా మెరిసే రూపాయి ఆమెచేతిలో పెట్టి మిగతా చిల్ల రివ్వమన్నాడు.

ఆవిడె వాడి రూపాయి తీసుకుంటూ వాడి వైఖరి కనిపెట్టింది. వాడితొందరా, అటూ యిటూ దిక్కులు చూడడమూ కనిపెట్టింది. వెంటనే వాడి రూపాయి వాడి చేతిలో పెట్టింది.

"ఉండు ఉండు!" అన్నది ఆవిడె.

"ఏమిటి ఉందూ ?" అన్నాడు వాడు.

"ఆ! యీ రూపాయి నీ కెట్లా వచ్చింది నాయనా? నిజము చెప్పేం" అన్న దావిడె.

"నీ కెందు కదంతా? నే నిట్లా ఎన్నిసార్లు కొన లేదు నీ దగ్గిర" అని అడిగాడు వాడు.

"నిజమే. చాలసార్లు కొన్నావుగాని యీ తొం దర లేదు. నిజం చెప్పేం!"

రామూర్తికి కొంచెం భయం వేసింది. "నే పోవా లమ్మమ్మా. తొందరగా తీసుకో!" అన్నాడు వాడు.

"తొందరగా కానీవోయి రామూ" అని పా ర్కులో ఒక చెట్టువెనకాలినుంచి కాడీరంగడి గొంతుక వినబడింది.

"ఇటు చూడు రామూ! ఒక్క అడుగైనా ఇక్కడ్నుంచి కదలగూడదు నిజం చెప్పేదాకా" అన్నది ఆవిడె.

"అయితే విను. నన్నేం చేస్తావో చూస్తాను. వంటయింటి అల్మారాలోంచి తెచ్చాను."

"ఆఁహా!" అన్న దావిడె.

"తప్పేమున్నది? రంగ డేమంటాడో తెలు సునా? వాళ్ల నాన్న జేబుల్లోంచిగూడా తీసుకుం టాట్ట!" అన్నాడు రామూర్తి. "వాళ్ల నాన్న యేమీ అనడుట."

"అవును ఎట్లా అంటాడూ? ఆజమాందారు పాయలో ఆయనకు ఎంతుంటుందో, యెంతపోతుందో లెక్క తెలిస్తేగా!" అన్నది ఆవిడె.

ఈ గలభా అంతా చూచి ఇదేదో ముదిరిన ట్లున్నదనుకుని రంగడు పారిపోయాడు.

"ఆ! మాయింట్లోమాత్రం యేమంటారూ? ఇంట్లో వున్నది అందరిదీనీ!" అన్నాడు రామమూర్తి. "ఇంతేగాదు, యేవైనా ఫలహారాలూ అవీ వుంటే తడవతడవా అడిగే తీసుకుంటామా? అక్కడుంటే అట్లాగే తీసుకుంటాం. మాయింట్లోగూడా యేమీ అనరే."

"కాదుకాదు. డబ్బువిషయ మట్లాకాదు సుమా! ఒప్పుకో నాయనా!" అన్నది ఆముసలి.

"ఏమో! నేనిట్లా యిదివర కెన్నడూ చేయ లేదు." అన్నాడు వాడు. వాడి ముఖాన పశ్చాత్తాపం చూపింది.

"ఆఁ! ఇప్పుడు మంచి పిల్లవాడివి. ఇట్లా ఇం కెప్పుడూ చేయకేం! ఎవరైనా చేస్తే తప్పని చెప్పేం! ఇంటికి పోయి మీఅమ్మతో చేసినదంతా చెప్పుకో! భగవంతుడ్ని తలచుకుని ఇట్లా ఇంకెప్పుడూ చేయనని ఒట్టుపెట్టుకో. నీమనస్సుకు బలమొస్తుంది. సరేనా నాయనా?" అని అడిగింది.

"అట్లాగే చేస్తాను అమ్మమ్మా! తప్పకుండా చేస్తాను అమ్మమ్మా. నా కిప్పుడు గుండెమీదినుంచి బరువేదో దించినట్లుగా వుంది. నే పోతున్నానమ్మ మ్మా!" అని రామూర్తి వెళ్లిపోయాడు.

వాడు పోయింతర్వాత "ఒక పిల్లవాడ్ని ఇంకో పిల్లవాడు సులభంగా చెడగొట్టే స్కూళ్లు స్కూళ్లా! ఒకడ్నిచూచి ఇంకొకడు బాగుపడాలి. అట్లయితేనే యీ స్కూళ్లవల్ల లాభం" అనుకున్నది ఆకాశవాణి కామమ్మ.

రామూర్తి ఇంటికి పోయి తల్లితో జరిగిన దంతా చెప్పాడు. తల్లి సంతోషించింది. వాడ్ని ఊర డించింది. ఆ రాత్రి వాడికి ప్రియమైన బజ్జీలు చేసి పెట్టింది.

ఆ తల్లి రాత్రి పడుకోబోతూ "అంగడిపెట్టుకుని జీవించే ఆడవాళ్లాముసలామె చూపిన ఇంగితమూ, నమ్మకమూ కనబరిస్తే ఆడవాళ్లిల్లా యెలా వుంటారూ!" అని మనస్సులో అనుకున్నది.